



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

టీజీవీ గూండాల దాడి దారుణం

- ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి
- ప్రజా సంఘాల నేతలు డిమాండ్ - కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

టీజీవి ఎస్ఆర్ఏఏసి ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణలో భాగంగా పాలిటెట్రాఫ్లోరో ఇథియం రసాయనం తయారు చేయడానికి అనుమతిలో భాగంగా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ అప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టారని, తక్షణమే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వెళ్లిన ప్రజాసంఘాల నాయకులపై టీజీవి గూండాలు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన టీజీవీ గూండాలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యాజీ శ్రీనివాసులు, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, ఎఐకెఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, విద్యావంతుల వేదిక నాయకులు భాస్కర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం నాయకులు అల్లా బకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, పిఐపి నాయకులు మోహన్, కాంగ్రెస్ నాయకులు లాజర్ మాట్లాడారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ తన కుమారుడు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అండతో ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణను 4 వేల మంది గూండాలను పోగు చేసి, వారిని ముందస్తుగానే రెచ్చగొట్టి రసాయనం విష ప్రభావాన్ని ఎవరు చెప్పకుండా, కనీసం రాసిన అభిప్రాయాన్ని నోట్ చేయకుండా నిర్బంధంగా దాడి చేసి గెంటి వేయించారన్నారు. గూండాల చేతిలో పోలీసులు కీలుబొమ్మల్లా మారి వ్యవహరించడం శోచనీయమన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. విష రసాయనాల ప్రభావానికి సంబంధించి శాస్త్రవేత్తల బృందంచే విచారణ చేయించి ప్రజలకు అనుమానాలను నివృత్తి చేయించాలన్నారు. ప్రేక్షకపాత్ర వహించిన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ప్రజల ప్రాణాలను, పర్యావరణాన్ని రక్షించుకోవడం కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు మనోహర్ మాణిక్యం, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డేవిడ్, సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు, నాయకులు నరసింహులు, సాయిబాబా, రామాంజనేయులు, సుధాకరప్ప, జీవివి నాయకులు రమణారెడ్డి, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్, నాయకులు శేషాద్రి, శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా, ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, డివైఎఫ్ఐ నాయకులు అంజి, ప్రకాష్, హరి కిషన్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా నాయకులు భాస్కర్, పెద్దబాబు, యేసురాజు, రాజ్ కుమార్, కృష్ణ, సుధాకర్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 17న కర్నూల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి సీ.క్యాంప్ రైతు బజార్, ప్రజా వేదికకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ఎస్పీతో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా సి క్యాంప్‌లో ఉన్న రైతు బజారులో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి షాప్ వద్ద డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలని, నంబర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే పైన గ్రీన్ షెడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు త్వరితగతిన చేయాలని, ఎప్పటికపుడు పనులు ఎంతవరకు పూర్తయ్యాయో అప్‌డేట్ ఇస్తూ ఉండాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. మార్కెట్ లోపల, బయట పరిసరాలు, టాయిలెట్‌లు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం ధనలక్ష్మి నగర్‌లో స్వచ్ఛ ఆంధ్ర పార్క్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న సందర్భంగా అక్కడ కోడ్ ఏర్పాట్లను పరిశీలించారు. పార్కులో ప్లాంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అటవీశాఖ అధికారిని ఆదేశించారు. పార్కు సుందరీకరణ వివరాలను తెలియజేసే విధంగా ఫ్లెక్సీని రూపొందించాలన్నారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రజావేదిక ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.. బందోబస్తు, పార్కింగ్, వేదిక తదితర ఏర్పాట్లపై ఎస్పీ, సిఎం కార్యాలయ అధికారులతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, రాష్ట్ర రైతు బజార్ సీఈవో మాధవీ లత, మార్కెటింగ్ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ కుమార్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, జిల్లా అధికారులు, టిడిపి నాయకులు తిక్కారెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఎస్పీతో కలిసి కలెక్టర్ ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌ను పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్‌లో తగిన భద్రత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

ప్రజా సంఘాల నాయకులపై

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- కేసులు నమోదు చేసి శిక్షించాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అల్కాలీస్ పరిశ్రమలో టెప్లాన్ (పిటిఎఫ్ఇ) తయారీ పరిశ్రమ కోసం బుధవారం గొందిరపల్లలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో తమ అభిప్రాయాలను చెప్పడానికి వెళ్లి ప్రజా సంఘాల నాయకులపై దాడులు చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు నగరంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శులు ఎం.రాజశేఖర్, టి.రాముడులతో కలిసి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడారు. గొందిపర్ల పంచాయతీ పరిధిలో అల్కాలీస్ పరిశ్రమ ఆవరణలో జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణను రద్దు చేయాలని, అభిప్రాయాలను చెప్పడానికి వెళ్లిన ప్రజా సంఘాల నాయకులపై దాడులు జరు గుతున్నా చోద్యం చూసిన పోలీస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్కాలీస్ పరిశ్రమకు అను బంధంగా ఏర్పాటు చేసే కొత్త పరిశ్రమతో పంచలింగాల, తాండ్రపాడు గ్రామాలతో పాటు కర్నూలు నగర ప్రజలకు ప్రమాదం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి చెప్పినప్పటికీ అధికార, డబ్బు బలంతో ప్రజల ప్రాణాలతో సంబంధం లేదంటూ టీజీవీ గ్రూపు సంస్థ యాజమాన్యం మొండిగా వెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. పరిశ్రమలో వాడే పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిన బాబురావు అనే సైంటిస్టును కమ్యూనిస్టుగా ముద్ర వేయడం సమంజసం కాదన్నారు. ఆరు నెలల సమయం ఇస్తామని, అప్పుడు దాకా ఎటువంటి ఉత్పత్తి చేయనని చెప్పిన టిజి వెంకటేష్ ప్రజాభిప్రాయ సేకరణలో అభిప్రాయాలు చెప్పడానికి వచ్చిన ప్రజా సంఘాల నాయకులను వారి గుండాలతో ఎందుకు బయటికి పంపించాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు తమ అభిప్రాయాలను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉండేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని చెప్పినా జిల్లా అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. టీజీ వెంకటేష్ తయారు చేసుకొచ్చిన స్క్రిప్టులను చదవడం తప్పా ప్రజల అభిప్రాయాలను చెప్పడానికి ఎటువంటి అవకాశం కల్పించక పోవడం జిల్లా అధికారుల వైఫల్యమే అన్నారు. తమ అభిప్రాయాలను చెప్పడానికి వచ్చిన ప్రజా సంఘాల నాయకులను పోలీసుల సమక్షంలో టీజీవి గుండాలు ఎత్తుకెళ్లి బయట పడేసి దాడులు చేయడం పట్ల జిల్లా అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. దాడులు జరుగుతున్నా నివారించకుండా చోద్యం చూసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

పత్తికొండలో వరుస దొంగతనాలు

- గడిచిన నాలుగైదు నెలల్లో పిఎస్‌లో 9 ఫిర్యాదులు
- 3 చోరీలను రికవరీ చేసిన పోలీసులు
- ప్రజలకు కంటి మీదు కునుకు లేకుండా చేస్తున్న దొంగలు

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ పట్టణంలో వరుస దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు ఎవరి ఇంట్లో దొంగతనం జరుగుతుందోనని ప్రజలు హడలెత్తిపోతున్నారు. పత్తికొండ పట్టణంలో గడిచిన నాలుగైదు నెలల కాలంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో దొంగతనాలపై 9 ఫిర్యాదులు అందాయి. ఇందులో పోలీసులు మూడు రికవరీ చేశారు. ఈ ఏడాది జనవరి 2వ తేదీన పత్తికొండ పట్టణానికి చెందిన సిరివాటి జమ్మన్న ప్లాస్టిక్ స్టీల్ దుకాణంలోని 26 వేల రూపాయలు దొంగతనం జరిగింది. ఫిబ్రవరి 24న పత్తికొండ మండలం పెద్దహుల్తి గ్రామంలో బోయ వరలక్ష్మి పత్తికొండలోని అంబేద్కర్ సర్కిల్ దగ్గర రూ.3 లక్షల 90 వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. అదే నెల 28న పత్తికొండ మండలం హోసూరు గ్రామంలోని ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్‌లో కరెంట్ మోటర్‌ను దొంగలు చోరీ చేశారు. మార్చి 17న పత్తికొండ పట్టణానికి చెందిన కుమ్మరి శ్రీనివాసులు ఇంటిలో రూ.30 వేలు నగదు, బంగారు, వెండి కలిపి 14 తులాలు దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మే 5న దొంగను పట్టుకొని సొమ్మును రికవరీ చేశారు. మార్చి 25న పత్తికొండ పట్టణంలోని శిరిడి సాయి స్కూలు సమీపంలోని బాధితురాలు లక్ష్మీదేవి రూ.6 వేలు విలువ చేసే వెండిని దొంగలు చోరీ చేశారు. పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఏప్రిల్ 27న దొంగను పట్టుకొని వెండిని రికవరీ చేశారు.



మార్చి 27న పత్తికొండ మండలం దేవనబండ గ్రామంలోని రంగన్న ఇంటిలో రూ.82 వేలు నగదు, రూ. 72 వేలు విలువ చేసే బంగారు, వెండి వస్తువులు చోరీ జరిగాయి. అదే రోజు చిన్నహుల్తి గ్రామంలో బోయ వీరేష్ ఇంటిలో లక్ష రూపాయలు విలువచేసే బంగారు, 40 వేల రూపాయలు నగదు దొంగతనం చేశారు. ఏప్రిల్ 29న పత్తికొండ పట్టణంలోనిఅక్బర్ సాహెబ్ గోల్డ్ షాప్‌లో బంగారు, వెండి, ఇతర సామాగ్రితో కలిపి ఒక లక్ష 30 వేల రూపాయలు దొంగతనం జరిగింది. మే 5న పత్తికొండలోని ఎరుకుల మహాదేవి ఇంటిలో రూ.20 వేలు చోరీ చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు దొంగను పట్టుకొని నగదును రికవరీ చేశారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దొంగలు ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేస్తున్నారు. ఇళ్లలో ఉండే నగదుకు, సొమ్ముకు రక్షణ కరువైందంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు యంత్రాంగం దొంగల బారి నుండి రక్షణ కల్పించాలంటూ పట్టణ, గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

న్యాయం చేయండి...



నేను, నా భార్య చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. డబ్బును పోగుచేసి కూతురు కోసం నాలుగు తులాలు బంగారును కొనుగోలు చేశాను. ఇంట్లోకి దొంగ చొరబడి నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. గతేడాది ఆగస్టు 7న ఫిర్యాదు చేశాను. ఇప్పటి వరకు దొంగను పట్టుకోలేదు. బంగారం దొరకలేదు. పోలీసులు న్యాయం చేయాలి.

- బాధితుడు రామచంద్రుడు. పత్తికొండ.

దొంగలపై ప్రత్యేక నిఘా పెట్టాం



దుకాణ యాజమానులు, గృహాల యాజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పత్తికొండలో మెయిన్ రోడ్డు, అయ్యప్ప కాంప్లెక్స్, మార్కెట్ యార్డ్, తేరు బజార్ రద్దీ ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాము. సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అసాంఘిక కార్యక్రమాలు, దొంగలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగలను పట్టుకోవడానికి సులువుగా ఉంటుంది. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలి.

- జయన్న, పత్తికొండ అర్బన్ సిఐ.

డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 6వ సెమిస్టర్ డిగ్రీ ఫలితాలను రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. ఈ పరీక్షలు 2022-2025 బ్యాచి చివరి సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ నెలలో నిర్వహించామని, మొత్తం 216 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 216 మంది ఉత్తీర్ణత సాధించారని డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.నాగరాజ్ శెట్టి తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బాలకృష్ణయ్య శెట్టి, డాక్టర్ పి.ఓబులేసు పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - మద్దికెర

మద్దికెర గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం నేషనల్ జస్టిస్ పొలిటికల్ పార్టీ ఛైర్మన్ నారగోని, సీనియర్ హైకోర్టు లాయర్ జయరాజు ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి, దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రపంచంలో యుద్ధాలతో సాధించలేనిది, కేవలం జ్ఞానంతో రాజ్యాంగాన్ని సాధించిన మొదటి వ్యక్తి డాక్టర్ అంబేద్కర్ అని తెలిపారు. అణచివేత, చిన్నచూపునకు గురైన అంబేద్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదివి, రాజ్యాంగాన్ని రచించి అన్ని వర్గాల మన్ననలు పొందారని చెప్పారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని, నిరంతరం జ్ఞానం కోసం శ్రమిస్తూ తాము తక్కువ కాదనే దృక్పథంలో ఉండాలన్నారు. సర్పంచి బండారు సుహాసిని, ఎంపిపి అనిత యాదవ్, జడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచి శాంతన్న, టిడిపి జిల్లా కార్యదర్శి గూడూరు ధనంజయుడు, సంధులు తిరుపాలు, ప్రతాప్, పంచాయతీ సలహాదారుడు బండారు ఆంజనేయులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు రాఘవేంద్ర, ఆనంద్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న నారగోని

మంత్రి విజయ్ షాను అరెస్టు చేయాలి

- ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్ హుస్సేన్, షరీఫ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరి అని పోల్చిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాను అరెస్టు చేయాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎమ్‌డి.షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఆవాజ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. భరతమాత రక్షణ కోసం ప్రాణాలకు తెగించి కేవలం 25 నిమిషాల్లో 9 ఉగ్రవాదుల స్థావరాలను తుదముట్టించిన వీర, ధీరశాలి సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరి అని సంబోధించిన మంత్రి విజయ్ షాను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్ గవర్నర్ ఆయనపై చర్యలు తీసుకొని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు.



మాట్లాడుతున్న నాయకులు

భట్టాచార్య మరణం రవాణా రంగానికి తీరని లోటు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అఖిలభారత రోడ్డు రవాణా కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు నేపాల్ బుద్ధదేవ్ భట్టాచార్య (74) అకాల మరణం రవాణా రంగానికి తీరని లోటని పలువురు నేతలు పేర్కొన్నారు. నేపాల్ బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభ కర్నూల్ నగరంలోని కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముందుగా బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు న్యూ సిటీ నగర కార్యదర్శి సాయిబాబా, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్‌కె రియాజ్, స్కూల్ బస్ యూనియన్ నాయకులు సిద్దయ్య, అటో యూనియన్ న్యూ సిటీ కార్యదర్శి బి.రాధాకృష్ణ, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి ఎస్ఎండి. రఫీ తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండి అంజిబాబు, సాయిబాబా, కె.ప్రభాకర్, రియాజ్‌లు మాట్లాడుతూ భట్టాచార్య 1979 నుంచి 86 వరకు ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా కార్యదర్శిగా అనేక సేవలందించారని తెలిపారు. పశ్చిమ బెంగాల్లోని కార్మిక వర్గం కోసం అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. 1981లో సిపిఎం పశ్చిమ బెంగాల్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారని, రాజ్యసభలో కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ధీటుగా ప్రభుత్వానికి తన వాగ్దాటిని వినిపించే వారన్నారు. పోరాటాలే కాకుండా కళ ద్వారా ప్రజలను చైతన్యం చేయవచ్చనే ఉద్దేశంతో 2022లో మిథున్ చక్రవర్తి దేవి శ్రీ నటించిన చిత్రానికి దర్శకత్వం వహించారని తెలిపారు. ఈ చిత్రంలో కార్మిక హక్కులు, సామాజిక న్యాయం కోసం స్టో మ్యాచ్ గురించి తెలియజేశారని అన్నారు. 2022లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని, అప్పటినుంచి రవాణా రంగ కార్మికుల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. భట్టాచార్య మరణం కార్మిక వర్గానికి ముఖ్యంగా రవాణా రంగ కార్మికులకు తీరని లోటన్నారు. కార్మికులు ఆయన ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకొని పోరాటం సాగించాలని తెలిపారు. ఆటో కార్మిక సంఘం నగర నాయకులు నబి, శిఖామణి, దానం, సురేష్, జ్యోతి, శంకర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

నగరంలో పడకేసిన పారిశుధ్యం

- పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పుల్లారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని పారిశుధ్యం పడకేసిందని, ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని పరిశుభ్రతను మెరుగుపరిచి ప్రజారోగ్యాన్ని కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఈ.పుల్లా రెడ్డి, కాలనీల ప్రతినిధులు ఎస్.రమణ గౌడ్, ఎస్.సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికులతో కలిసి పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం భాస్కర్ నగర్, గిప్సన్ కాలనీ, బంగారు పేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం నియమించిన కాంట్రాక్టర్ రుణాలు చెల్లించనందున చెత్త సేకరించే 90 మినీ వాహనాలను ఆర్థిక సంస్థలు సీజ్ చేశాయని తెలిపారు. దీనికి తోడు మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రజారోగ్య శాఖ అధికారి కార్యాలయానికే పరిమితమయ్యారని తెలిపారు. కొంతమంది కిందిస్థాయి అధికారులకు ప్రజలంటే గౌరవం లేదని, ప్రభుత్వమంటే భయం లేదని విమర్శించారు. పారిశుధ్య సమస్యపై ఫిర్యాదు చేస్తే కొందరు కిందిస్థాయి అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ సకాలంలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదన్నారు. ఈ లోపం వల్ల ఖాళీ ప్లాట్లలో, రోడ్లపైనా, కెసి కెనాల్‌లో చెత్త వేస్తున్నారని తెలిపారు. దుర్వాసనతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకొని పెరిగిన జనాభాకు అనుగుణంగా చెత్త సేకరించే వాహనాలు, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. పారిశుధ్యం పట్ల, ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎ.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరెడ్డి, సివి.వర్మ, బి.పురుషోత్తం రెడ్డి, చిరంజీవి, పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ప్రతినిధి ఎన్.రాబర్ట్ పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న నాయకులు

17న సిఎం పర్యటను విజయవంతం చేయండి

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఈ నెల 17న సిఎం చంద్రబాబు నాయుడు నిర్వహించనున్న ఉమ్మడి కర్నూల్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్‌లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఎం చంద్రబాబు నాయుడు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. టిడిపి, బిజెపి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సిఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. జిల్లాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి జిల్లాలో సాగు, తాగు నీటి సమస్య, పరిశ్రమల స్థాపనకు సిఎం ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి సమానంగా చేయాలన్న ఉద్దేశంతో 17న పాణ్యం నియోజక వర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. రైతు బజారు సందర్శన, ప్రజావేదిక సభ ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశారని తెలిపారు. వచ్చే జూన్ 12న మరికొన్ని పథకాలు ముఖ్యంగా తల్లికి వందనం కింద చదువుకుంటున్న ప్రతి విద్యార్థి తల్లి అకౌంటులో ప్రకటించిన మేరకు మొత్తాన్ని జమచేస్తారన్నారు. అలాగే రైతు బందు పథకాలకు నిధులు విడుదల, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటివి అమలు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు నంద్యాల నాగేంద్ర, ఎస్.ముంతాజ్, జె.పుల్లయ్య, కె.మహేష్ గౌడ్, సత్రం రామక్రిష్ణుడు, హనుమంతరావు చౌదరి, షేక్షావలి, బెత క్రిష్ణుడు, నందిమధు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి



కలెక్టర్‌కు డిఇఒ అభినందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యారంగం బలోపేతానికి నిర్దిష్టమైన ప్రతిపాదనలు పంపి అత్యధిక పోస్టులు మంజూరు చేయించిన నేపథ్యంలో గురువారం డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్ కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలిసి అభినందనలు తెలిపారు. పాఠశాలలో రాబోయే సంవత్సరానికి ఉపాధ్యాయుల కొరత లేకుండా జిల్లాకు కొత్త పోస్టులు, పాఠశాల మంజూరు చేయించడం పట్ల విద్యాశాఖ రాబోయే విద్యాసంవత్సరంలో నూతనోత్తేజం పొందుతుంది. నాణ్యమైన విద్యా బోధన అందించే లక్ష్యంతో కృషి చేశారని ఇందుకు జిల్లా విద్యాశాఖ తరపున కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి'

ప్రజాశక్తి - పత్తికొండ

స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని రామకృష్ణారెడ్డి నగర్‌లో 'స్మార్ట్ మీటర్లు వద్దు' అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు దస్తగిరి, పిఎన్‌ఎం నాయకులు కాశన్న, రమేష్, కాలనీవాసులు నరసన్న, రంగన్న, రంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ క్రీడా పోటీలకు క్లస్టర్ విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ మెన్ డిగ్రీ కళాశాల స్టేడియంలోని లక్ష్య సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు మద్దూరు రేణుక (బిఎ), బోయ శ్రీలక్ష్మి (బికామ్) రాష్ట్ర బీచ్ సాకర్ టీముకు ఎంపికయ్యారు. డయ్యుడామన్‌లో జరిగే ఖేలో ఇండియా జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులను క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి, ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాస రెడ్డి, కోచ్ కె.బ్రహ్మ కుమార్ గురువారం అభినందించారు. జాతీయ క్రీడల్లో మంచి ప్రతిభ కనపరచి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు ట్రోఫీ తీసుకొస్తే మంచి ప్రోత్సాహం అందిస్తామని ప్రెసిడెంట్ ముప్పు రాజశేఖర్ తెలిపారు.

కోతకు గురవుతున్న రోడ్డు

- మరమ్మతులు చేపట్టండి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



కోతకు గురైన ప్రదేశాన్ని చూపిస్తున్న నాయకులు

ఆదోని నుంచి మాధవరం వెళ్లే రోడ్డులో గణేకల్లు నుంచి కుప్పగల్లు వరకు ఆర్‌అండ్‌బి రోడ్డు ఇరువైపులా కోతకు గురైందని, ఆర్‌అండ్‌బి అధికారులు రోడ్డుకిరువైపులా గరుసు వేసి చదును చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శి వర్గసభ్యులు బి.వీరారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కార్యకర్తలతో కలిసి కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు నెలల క్రితం పాండవగల్ దగ్గర దీనివల్లనే ప్రమాదం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 4, 5 వాహనాలు సైడ్‌కు దిగే సందర్భంలో బోల్తా పడినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే రోడ్డుకిరువైపులా గరుసు వేసి చదును చేయాలని కోరారు. అక్కడక్కడ రోడ్డు మధ్యలో గుంతలు పడిన వాటిని వేయకుండా వదిలేయడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు పాండురంగ, శాఖ కార్యదర్శి గోవిందు, పార్టీ సభ్యులు కె.నర్సిరెడ్డి, హుసేని, మల్లికార్జున, కార్యకర్తలు ఆంజనేయ, మాబాష, రాము, వీరేష్ పాల్గొన్నారు.

20న సమ్మెను జయప్రదం చేయండి

- కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాల చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ, ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు కృష్ణమూర్తి కోరారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఆశా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రైతు సంఘం మండల అధ్యక్షులు మధు రెడ్డి, డివైఎఫ్ఐ మండల నాయకులు రవి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తరుణ్, ఎఐటియుసి మండల గౌరవాధ్యక్షులు హనుమంతు పాల్గొన్నారు.

వీధులన్నీ శుభ్రంగా ఉంచాలి

- మున్సిపల్ ఇన్‌ఛార్జీ చైర్మన్ మహ్మద్ గౌస్

ప్రజాశక్తి - ఆదోని



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మహ్మద్ గౌస్

మహాయోగి లక్ష్మమ్మ అవ్వ జాతర సందర్భంగా ఆదోనిలో వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలని మున్సిపల్ ఇన్‌ఛార్జీ చైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్ తెలిపారు. గురువారం పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లక్ష్మమ్మ అవ్వ జాతర సందర్భంగా షరాఫ్ బజార్, వన్ టౌన్ పరిధిలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేయిస్తున్నామని తెలిపారు. జాతర సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శుభ్రత, తాగునీటి సమస్య రాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుని, అన్ని ప్రాంతాల్లో శుభ్రత పనులు పూర్తి చేయాలని, సమయానికి తాగునీరు సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు.

తెలంగాణ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - సి బెళగల్

తెలంగాణకు చెందిన తుప్పరాల గ్రామం సూర్య మహేష్ గౌడ్ ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ పరమేష్ నాయక్ గురువారం పట్టుకున్నారు. తుంగభద్ర నదిలో తెలంగాణ పరిధి దాటి ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వచ్చి ఇసుకను తరలించుకొని వెళ్తున్నారని విఆర్ఒ రంగముని ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మరమ్మతులు కరువు

- నిరుపయోగకరంగా ఆరోగ్య ఉప కేంద్రం
- నేమకల్లులో ముళ్లచెట్లకే పరిమితమైన వైనం
- అద్దె భవనంలో కొనసాగిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నేమకల్లు గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ ముళ్లకంప పెరిగి నిరుపయోగంగా మారింది. మరమ్మతులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే ఆరోగ్య ఉప కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు, స్థానిక వైద్యాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.



ముళ్ల కంప మధ్యలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం

కింద స్థాయిలో మారుమూల గ్రామాల్లో ఉన్న నిరుపేదలకు వైద్యం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వాలు అనుకున్నంత మేర కింద స్థాయిలో వైద్యం అందడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. మండలంలోనే పెద్ద గ్రామమైన నేమకల్లులో ఆరోగ్య ఉప కేంద్రం ఉన్నా కొన్నేళ్లుగా నిరుపయోగకరంగా మారింది. వైద్య సిబ్బంది దానిని పక్కనపెట్టి గ్రామంలో అద్దె భవనంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. నేమకల్లు మజరా గ్రామం సంఘాల, చుట్టుపక్కల గ్రామాలు తిమ్మాపురం, నగరడోనా, బెల్డోన ఒక కిలోమీటరు, రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. దాదాపు 15 వేల జనాభా ఉన్నప్పటికీ ఆరోగ్య ఉప కేంద్రం నిరుపయోగంగా ఉంది. దానికి మరమ్మతులు చేపట్టేందుకు ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నారు. ఆరోగ్య ఉప కేంద్రం అన్ని వసతులతో ఉంటే ఈ చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు వైద్యం చేయించుకోవడానికి సులభతరం అవుతుంది. ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు స్పందించి జిల్లా ఉన్నతాధికారులకు ముఖ్యంగా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాలని, ఆరోగ్య ఉప కేంద్రాన్ని పునర్నిర్మాణం చేయించి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఈ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి వస్తే సంతోషం

- రాజేష్, నేమకల్లు గ్రామం

నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తే మహిళలు సంతోష పడతారు. వైద్య సిబ్బందిని నియమించి సేవలందిస్తే గర్భిణులు, బాలింతలు, వృద్ధులు సంతోష పడతారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే ఆరోగ్య ఉపకేంద్రాన్ని అందుబాటులోకి తేవాలి.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం

- ఎంపిడిఒ అల్లా బకాష్



నేమకల్లు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రానికి మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపించాం. మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కింద కేంద్ర ప్రభుత్వం తీసుకోవడంతో ప్రాధాన్యత ఉన్న పనులను పరిష్కరించుకోవడానికి నిధులు త్వరలో మంజూరవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్య ఉపకేంద్రానికి మరమ్మతులు చేయడానికి నిధులను మంజూరు చేయాలని అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరయిన వెంటనే ఆరోగ్య ఉప కేంద్రాన్ని మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తాం.

తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

జల జీవన్ మిషన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులు దాదాపు రూ.583 కోట్లతో మంత్రాలయం నియోజకవర్గంలో ఉన్న పులికనుమ ప్రాజెక్టు ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపడం హర్షణీయమని పేర్కొన్నారు. గురువారం ఆదోనిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో చాలా గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని తెలిపారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తూనే కేంద్ర మంత్రుల దృష్టికి వినతుల రూపంలో తీసుకెళ్లామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకొని ఆ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడికి శాశ్వత నివారణకు చర్యలు తీసుకున్నాయని తెలిపారు. ఇప్పటికే దీనికి సంబంధించిన తొలి అడుగులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రతి గ్రామానికీ జల జీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంకు నిర్మించి వాటి ద్వారా ఇంటింటికీ కుళాయి ఇచ్చి తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. పెద్దతుంబలం, జి.హోసల్లి, రంగాపురం, ఆరెకల్ కొండల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి అన్ని గ్రామాలకు తాగునీరందేలా ఈ పథకంలో పొందుపరిచినట్లు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, టిడిపి కర్నూలు పార్లమెంటు అధ్యక్షులు భూపాల్ చౌదరి, నాయకులు విట్టా రమేష్ ఉన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

అభివృద్ధికి చిరునామా 'కూటమి'

- రాఘవేంద్ర రెడ్డి, టిప్పు సుల్తాన్ - రూ.1.62 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - కౌతాళం

అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వమని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్ తెలిపారు. గురువారం రూ.1.62 కోట్లతో తుంగభద్ర దిగువ కాలువపై (జంగల్ క్లియరెన్స్) అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అందరికీ అన్నం పెట్టే రైతు బాగుండాలంటే పంటలు పండాలని, పంటలు బాగా పండాలంటే రైతులకు సాగునీరు అందాలని తెలిపారు. సాగునీరందాలంటే, సాగునీరు సరఫరా కాలువలు బాగుండాలని, అందుకే ముఖ్యమంత్రి రైతులకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే తుంగభద్ర దిగువ కాలువకు అభివృద్ధి కోసం రూ.1.62 కోట్లను మొదటి విడత కింద మంజూరు చేశారని తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. త్వరలో ఆ నిధులు కూడా మంజూరు చేయించి కాలువ కింద ప్రతి రైతుకూ సాగునీరందించే బాధ్యత కూటమి నాయకులదని పేర్కొన్నారు. మంత్రాలయ నియోజకవర్గ అభివృద్ధికి నాబార్డ్ నుంచి రూ.5 కోట్లు, ఆర్‌అండ్‌బి రోడ్ల కోసం రూ.5 కోట్లు, టిఎస్ డిస్ట్రిబ్యూటర్ లైనింగ్ పనులకు రూ.29 కోట్లు, గ్రామాల్లో సిసి రోడ్లకు రూ.15 కోట్లతో ఒక్క ఏడాదిలోనే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎల్ఎల్‌సి పనులకు గాను కౌతాళం సెక్షన్‌కు రూ.32 లక్షలు, హాల్వి సెక్షన్‌కు రూ.28 లక్షలు, కోసిగి సెక్షన్‌కు రూ.33.60 లక్షలు, పెద్దకడబూరు రూ34 లక్షలు, గంగవరం సెక్షన్‌కు రూ.34 లక్షలు మంజూరయినట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో సాగునీటి కాలువల గురించి పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం తుంగ భద్ర బోర్డు పరిధిలోని హనువాల్ నుంచి బాపురం వరకు రూ.29 కోట్లతో 16 కిలోమీటర్ల వరకు జరిగే టిఎస్ కాలువ పనులను పర్యవేక్షించారు. ఎల్ఎల్‌సి డిఇ షఫీవుల్లా, ఎల్ఎల్‌సి జెఇ ఈశ్వర్, టిడిపి నాయకులు సతీష్ నాయుడు, సురేష్ నాయుడు, వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్, రామలింగ, జనసేన రామాంజులు, కురువ వీరేష్, రాజానంద్, తిప్పలదొడ్డి మల్లయ్య, కురువ వీరేష్, బదినేహాలు వీరేష్ నరసింహులు, జనసేన చిన్న, బిజెపి రాము, ఎరిగేరి గిడ్డయ్య, బసవరాజు, ఉరుకుంద పోతులయ్య, గట్టూరి ఈరన్న, అయ్యప్ప, చిరంజీవి, కుంటానహల్ మారెప్ప, ఆలం బాష, తోవి శంకర్, మాలపల్లి లక్ష్మన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రదీప్‌రెడ్డి

రిటైర్డ్ ఎంపిడిఒ మృతికి ప్రదీప్ రెడ్డి నివాళి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో మృతి చెందిన రిటైర్డ్ ఎంపిడిఒ ఫకృద్దీన్‌కు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి నివాళులర్పించారు. గురువారం అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న ఆయన వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డితో కలిసి ఫకృద్దీన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ... రిటైర్డ్ ఎంపిడిఒగా, వ్యవసాయ అధికారి ఫకృద్దీన్ మండల ప్రజలకు సేవలందించి మన్ననలు పొందారన్నారు.

గోవర్ధన్ నగర్‌లో రైతు బజార్‌ను సిఎం ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఈనెల 17న కర్నూలు నగరానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్న సందర్భంగా 32వ వార్డు గోవర్ధన్ నగర్‌లో ఉన్న రైతుబజార్‌ను ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించేలా కలెక్టర్, ఎమ్మెల్యే గౌరు చరిత కృషి చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుబజార్ పూర్తయి దాదాపు ఏడాది కావస్తున్నా ఇంతవరకు ప్రారంభించక పోవడం వల్ల రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోందని తెలిపారు. ఇప్పటికే అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఇటీవల సిక్యాంపు రైతు బజార్ అధికారి వచ్చి పరిశీలించి త్వరలోనే రైతు బజారు ప్రారంభిస్తామని ప్రకటన చేశారని గుర్తు చేశారు. రైతు బజార్‌ను ప్రారంభించడం వల్ల చుట్టుపక్కల గ్రామాలు లక్ష్మీపురం, బస్తిపాడు, బొల్లవరం, పందిపాడు, కల్లూరు కాలనీలు ముజఫర్ నగర్, మాదిరాజు నగర్, గోవర్ధన్ నగర్, సుందరయ్య నగర్, కల్లూరు, చింతలముని నగర్, శరీన్ నగర్ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైతులు పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి ఈ రైతు బజార్ ఉపయోగపడుతుందని అన్నారు.

'ఐదు' ప్రవేశంలో విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి - సిబెళగల్



ఐదో తరగతిలో ప్రవేశానికి గాను సిబెళగల్ గురుకుల అటెండర్ కుమారుడు ప్రజ్వల్, అశ్విత్ ర్యాంకులు సాధించారు. ఇటీవల గురుకుల ప్రవేశానికి జరిగిన పరీక్షల్లో 47/50 మార్కులు సాధించి మండల టాపర్‌గా, జిల్లా స్థాయిలో 4వ స్థానం, రాష్ట్ర స్థాయిలో 31వ స్థానం సాధించారు. తాజాగా ఎపిఆర్ఎస్‌లో ప్రవేశానికి రాసిన పరీక్షలో 90/100 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 221వ స్థానంలో నిలిచారు. గురువారం తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోస్టుల భర్తీలో అపోహలకు తావు లేదు

- కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్



స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో పోస్టుల భర్తీలో అభ్యంతరాల విషయంలో ఎటువంటి అపోహలకూ తావు లేదని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి కె.నరసమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్ట్ విషయంలో సర్టిఫికెట్లు ఒరిజినల్ అని తేలిన తర్వాతనే వారికి వేతనాలు చెల్లిస్తామనే నిబంధనతోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చామని తెలిపారు. ఫేక్ అని తేలితే వారిపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని చెప్పారు. ఇటీవల 3 నోటిఫికేషన్లు వేర్వేరుగా ఇచ్చామని, వేటికవే సెపరేట్ అని తెలిపారు. 33 శాతం ఉమెన్ రిజర్వేషన్, ఎస్టీ రోస్టర్ అంశంలో కూడా ఉన్నతాధికారుల నుంచి వచ్చిన నూతన గైడ్ లైన్స్ ప్రకారమే భర్తీ చేశామని చెప్పారు. కేవలం రెండు పోస్టులు మాత్రమే ఉన్నందున 33 శాతం రిజర్వేషన్ అన్నది ఉత్పన్నం కాదని, ఇందులో ఎటువంటి నిబంధనల అతిక్రమణ జరగలేదని తెలిపారు. ఈ అంశంపై పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని చెప్పారు. పోస్టుల భర్తీ విషయంలో పూర్తిస్థాయిలో మెరిట్ కం రోస్టర్ సర్టిఫికెట్ల ఒరిజినాలిటీ అన్నది పరిశీలిస్తున్నామని, ఎటువంటి ప్రలోభాలకు తావులేదని తెలిపారు. అలాంటిదేదైనా తమ దృష్టికి వస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

క్యాంటీన్ వ్యవహారంపై స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్

కర్నూలు మెడికల్ కళాశాల క్యాంటీన్ వ్యవహారంపై చర్చించేందుకు మెడికల్ కళాశాలలోని అన్ని విభాగాల అధిపతులు, సిబ్బందితో శుక్రవారం కౌన్సిల్ హాలులో స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ తెలిపారు. అందులో అందరి అభిప్రాయాలు తీసుకుని డిఎంఇ దృష్టికి నివేదిస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాస్తవంగా క్యాంటీన్ వ్యవహారం గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అంతర్గత వ్యవహారమని, ఈ అంశం తరచూ వివాదాంశంగా ఉండటం కరెక్ట్ కాదని అన్నారు. పోలీసు శాఖ కూడా ఈ అంశంపై విచారణ జరిపించాలని కోరినట్లు తెలిపారు.

'బెల్టు' తీస్తారా..?

- పచ్చని గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

- ఎక్సైజ్, పోలీసు శాఖ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

పచ్చని గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతోంది. బెల్టు షాపులు వాడవాడలా కిరాణ కొట్టు మాదిరిగా వెలిశాయి. మద్యం ప్రియుల నుంచి రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తూ నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు. బెల్టు షాపులను అరికట్టడంలో అధికారులు పూర్తిగా చేతులెత్తేసి చోద్యం చూస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

గ్రామాల్లో బెల్టు షాపులతో మద్యం ఏరులై పారుతోంది. వాటిని నివారించడంలో అధికారులు చొరవ చూపడం లేదు. తెల్లవారుజామున 3 గంటల నుంచి బెల్టు షాపులను తెరిచి మద్యాన్ని విక్రయిస్తున్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తున్న ప్రదేశాల్లో మహిళలు తిరగడానికి భయపడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బెల్టు షాపు నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అధికారుల మాత్రం వారిపై చర్యలు చేపట్టడం లేదు. అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ప్రజలు, మహిళలు మండిపడుతున్నారు. బెల్టు షాపులకు మద్యాన్ని విక్రయిస్తే అటువంటి వైన్స్ షాపులపై రూ.5 లక్షల జరిమానా, లైసెన్స్ రద్దు చేస్తామని ప్రయివేట్ వ్యక్తులకు వైన్ షాపులు కట్టబెట్టే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రజల విమర్శిస్తున్నారు. బెల్టు షాపు నిర్వాహకులకు వైన్ షాపు యజమానులే 'ధైర్యంగా అమ్ముకోండి. మేమున్నామ'ని భరోసా ఇస్తున్నారని బెల్టు షాపు నిర్వాహకులు బహిరంగంగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం బెల్టు షాపులను నివారించడం ఏమో కానీ కూటమి నాయకులే మండలంలో చాలామంది బెల్టుషాపులను ఆదాయ వనరులుగా మలచుకొని వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ఎక్సైజ్, పోలీసు శాఖ నిర్లక్ష్యం

బెల్టు షాపులను నివారించడంలో ఎక్సైజ్, పోలీసు శాఖాధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారు. గతంలో వారానికి ఒక్కసారైనా పోలీసులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బెల్టు షాపులపై దాడులు నిర్వహించిన దాఖలాలు ఎక్కువగా కనిపించడం లేదు. మండలంలో సుమారు 80కి పైగా బెల్టు షాపులు ఉన్నట్లు సమాచారం. ఇంత విచ్చలవిడిగా, నిర్భయంగా నిర్వాహకులు మద్యం అమ్మకాలు జరిపినా పోలీసులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

'బెల్టు'తో జీవితాలు నాశనం

- సిపిఎం నాయకులు ఎల్లేష్



మండలంలో బెల్టు షాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. వారి వ్యాపారానికి అడ్డు చెప్పే వారు లేకపోవడంతో వ్యాపారం సాఫీగా కొనసాగుతోంది. వాడవాడలా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం అమ్మకాలు జరుపుతూ అమాయక ప్రజల నుంచి రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తు దోపిడీ చేస్తున్నారు. మద్యానికి అలవాటు పడిన వ్యక్తులు అధిక ధరలకు బెల్టు షాపులో మద్యాన్ని కొంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.



దంచి కొట్టిన వర్షం

- ఆనందంలో రైతన్నలు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుందలో గురువారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టడంతో రైతన్నలు ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఈఏడాది 32.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. ఇదే పదునైన వర్షమని రైతులు పేర్కొంటున్నారు. రైతులు పొలాల్లో పనుల్లో నిమగ్నమయ్యారు. మరో వర్షం కురిస్తే విత్తనాలు వేయడానికి సిద్ధమయ్యారు. రోహిణి కార్తెలో పత్తి విత్తనాలు వేస్తే పత్తి పంటకు పురుగు పడదని నమ్మకంతో ముందుగా పత్తి పంట విత్తనాలు విత్తుకుంటామని రైతులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఎర్ర నేలలో వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారు. వ్యవసాయ అధికారులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఉంచి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

20న సమ్మెకు రోడ్డు సైడ్ చిన్న వ్యాపారుల మద్దతు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు రోడ్డు సైడ్ చిన్న వ్యాపారుల సంఘం (సిఐటియు) సంపూర్ణ మద్దతు తెలియజేసింది. గురువారం నగరంలోని సూర్జిత్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఇక్బాల్ అహ్మద్ అధ్యక్షత వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్, నగర నాయకులు ఎస్ఎమ్‌డి.షరీఫ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో రోడ్డు సైడ్ చిన్న వ్యాపారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు షేక్ అక్బర్ బాషా, షఫీ, ఖలీల్, మాలిక్, ఇమ్రాన్, ఖాదర్ బాష, అబ్దుల్లా, అప్సర్, షాకీర్, షాషా, చాంద్ బాషా, రహమతుల్లా, అజమ్ పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఈనెల 17న కర్నూలు నగరానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జెసి డాక్టర్ బి.నవ్య, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు గురువారం పరిశీలించారు. రైతు బజార్ పరిసరాల ప్రాంతాలు, సభా మైదాన ప్రాంగణాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

'సంచార చికిత్స' తనిఖీ

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

కోడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బోయగేరిలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నోటిలో ఎరుపు లేదా తెలుపు మచ్చ మానకుండ ఉండడం, రెండు వారాలైనా పుండు మానకపోవడం, మింగడంలో లేదా నోరు తెరవడంలో ఇబ్బంది పడడం, 2 నుంచి 3 వారాలకు మించి స్వరంలో మార్పులు, నోరు, గొంతు లేదా మెడలో గడ్డ ఉండడం, ఉన్నట్లుండి ఒక్కసారిగా బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్, మాదన్న, నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



ఉచిత పాలిటెక్నిక్‌లో ర్యాంకులు

ప్రజాశక్తి - మద్దికెర

పదో తరగతి ఉత్తీర్ణత సాధించి పాలిటెక్నిక్‌లో చేరేందుకు రాసిన పరీక్షల్లో 50 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షులు సునీల్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. మద్దికెరలోని వశిష్ట స్కూల్‌లో ఆపద్బాంధవ సేవాసమితి ఆధ్వర్యంలో గత నెలలో 27 రోజుల పాటు ఉచిత పాలిసెట్ కోచింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మొత్తం 54 మందికి ఉచితంగా కోచింగ్ ఇచ్చినట్లు చెప్పారు. 120 మార్కులకుగాను ఐదుగురికి 85 మార్కులు, మరో 8 మందికి 75 మార్కులు, మరో 10 మందికి 65 మార్కులు, మరో 8 మందికి 55కు పైగా మార్కులు వచ్చి మంచి ర్యాంకు సాధించారన్నారు. ఇందులో 54 మందికి ఉచిత కోచింగ్, ఫ్రీ మెటీరియల్ ఇవ్వగా అందులో 50 మంది క్వాలిఫై అయ్యి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరిని సునీల్ కుమార్, వశిష్ట స్కూల్ నిర్వాహకులు కొలి పకీరప్ప అభినందించారు. వీరందరూ మంచి పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు సాధించి భవిష్యత్తులో స్థిరపడాలని ఆకాంక్షించారు.

సారా స్వాధీనం - నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - ఆదోని



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పట్టణ శివారు రణమండల కొండల చుట్టూ గల సింగరాజుమల్ల కొండల్లో, తాయమ్మ బైలులో, సముద్రపు కుంట ప్రాంతాల్లో నాటు సారా తయారు చేస్తున్న 9 మంది నిందితులను అరెస్టు చేసి, 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని 6 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని వన్‌టౌన్ సిఐ శ్రీరామ్ తెలిపారు. గురువారం నాటు సారా స్థావరాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. నాటుసారా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. రణమండల కొండల పైభాగంలో గల సముద్రపు కుంట ప్రాంతంలో, ఇస్వి గ్రామానికి వెళ్లే దారిలో గల తాయమ్మ బైలు ప్రాంతంలో, రణమండల కొండ వెనుక భాగంలో గల సింగరాజు మల్ల కొండ ప్రాంతాల్లో నాటు సారా తయారు చేస్తున్నారని సమాచారం ఉందన్నారు. ఉదయం 5 గంటల నుంచి ఏకధాటిగా దాడులు నిర్వహించి నాటు సారా తయారు చేస్తున్న 9 మంది నిందితులను అరెస్టు చేసి, 80 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 30 ప్లాస్టిక్, ఇనుప డ్రమ్ముల్లో గల సుమారు 6 వేల లీటర్ల బెల్లం ఊటను పారబోసి డ్రమ్ములను, బట్టీలను ధ్వంశం చేసి కేసులు నమోదు చేశామన్నారు. బోయ మురళీ, బోయ ఈరమ్మ, బోయ నాగమ్మ, బోయ సురేష్, బోయ రాజు, బోయ ఎరమ్మ, బోయ రమేష్, బోయ మద్దిలేటి, బోయ తిమ్మప్పను అరెస్టు చేశామన్నారు. నిందితులు వాల్మీకి నగర్, శుక్రవారం పేటకు చెందిన వారుగా గుర్తించామన్నారు.

అంత నా ఇష్టం.. అడిగేది ఎవ్వరూ..?

- సమయపాలన పాటించని హౌసింగ్ ఎఇ

- 12 గంటలైనా విధులకు హాజరు కాని వైనం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండల హౌసింగ్ ఎఇ అంజలి విధులకు హాజరు కావడంలో సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 10 గంటలకు కార్యాలయానికి హాజరు కావాల్సిన ఎఇ గురువారం కూడా 12 గంటలకు వచ్చారు. 'అంతా నా ఇష్టం. నన్ను అడిగేది ఎవరు' అన్నట్టుగా రోజూ ఏ సమయానికి వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారి కోసం గ్రామాల నుంచి లబ్ధిదారులు హౌసింగ్ కార్యాలయానికి వస్తే గంటల తడపడి వేచి చూసి చాలామంది వెనుతిరిగి పోతున్నారు. ఇల్లు నిర్మించుకుని వివిధ స్టేజీల్లో ఆగిపోయిన బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణ పనులు మొదలు పెట్టించడంలో అధికారులు విఫలమవుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి హౌసింగ్ ఎఇ విధులకు సక్రమంగా హాజరయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న ఎఇ కుర్చీ